వానలు పడితేనే 'ఖరీఫ్'కు నీళ్లు..



2



2

వారం రోజులుగా నీటి తిప్పలు..


AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com


## సుప్రీంకోర్టు తీర్పు విచారకరం

**అక్షరటుడే, భీమ్‌గల్:** సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు 'టెట్' తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు విచారకరమని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నేతలు ఎం.బాలయ్య, కె.ఓమాజీ, మండల నేతలు జాన్ విల్సన్, గట్టు ఈశ్వర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 15 ఏళ్లుగా సేవలందిస్తున్న వారికి టెట్ అవసరం లేదని ఎన్సీటీఈ, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలోనే స్పష్టం చేసినా, కోర్టు మినహాయింపు నిరాకరించడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, విద్యాహక్కు చట్టం సెక్షన్23ను సవరించడం ద్వారా సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.






## జేబులో సెల్‌ఫోన్ ఉందా.. తస్మాత్ జాగ్రత్త..?

**అక్షరటుడే, కామారెడ్డి:** చాలామందికి షర్ట్ జేబులో సెల్‌ఫోన్ పెట్టుకోవడం అలవాటు. అయితే ఈ ఎండా కాలంలో పైజేబులో సెల్ పెట్టుకునేవాళ్లు జాగ్రత్తగా ఉండాల్సిందే.. భానుడి భగభగల కారణంగా ఫోన్లు పేలిపోయే ప్రమాదం ఉంది. నిజాంసాగర్ మండలంలో శుక్రవారం ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. మండలంలోని మగ్ధుంపూర్ మాజీ సర్పంచ్ చంద్రగౌడ్ పని నిమిత్తం బయటకు వెళ్తూ.. జేబులో సెల్‌ఫోన్ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో మిట్టమధ్యాహ్నం ఎండ వేడిమికి జేబులోని సెల్‌ఫోన్ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో ఆయన షర్ట్ జేబు కొద్దిమేర కాలిపోయింది. వెంటనే అప్రమత్తమైన చంద్రగౌడ్ ఫోన్ తీసి కింద పడేశాడు. దీంతో ప్రమాదం నుంచి ఆయన తప్పించుకున్నాడు. ఎండలు ముండిపోతున్న వేళ సెల్‌ఫోన్లతో జాగ్రత్తగా ఉండాలని పలువురు సూచించారు.

# కాసుల కక్కుర్తి



- మితిమీరుతున్న ప్రైవేట్ ఆస్పత్రుల ఆగడాలు
- ఆర్ఎంపీ, పీఎంపీలకు కమీషన్లు
- టూర్లు, విలువైన బహుమతులతో ప్రలోభాలు
- నిబంధనలు ఉల్లంఘించి ఇంజెక్షన్లు, ఐవీ ఫ్లూయిడ్స్

**జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నాయి. ప్రాణాలను కాపాడాల్సిన వైద్యులు.. ఫీజులు, బిల్లుల పేరుట ప్రజల రక్తం పీలుస్తున్నారు. సాధారణ జ్వరం, తలనొప్పి అని వస్తే చాలు.. రోగుల బలహీనతలను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రులు అడ్డగోలుగా ఫీజులు, అనవసర పరీక్షల పేరిట దోపిడీకి తెరలేపాయి. ఈ దందాకు కొందరు క్వాలిఫైడ్ వైద్యులు, క్షేత్రస్థాయిలోని ఆర్ఎంపీ , పీఎంపీల కూటమి ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లా పనిచేస్తుండడం జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. జిల్లాలో 500కు పైగా ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి.**

**- అక్షరటుడే, భీమ్‌గల్**

నిజామాబాద్ నగరంలోనే 400 వరకు దవాఖానాలు ఉంటాయి. వీటిలో మరో 50 వరకు మల్టీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అమాయక రోగులను ఈ ఆస్పత్రులకు తరలించడమే లక్ష్యంగా పెద్ద ఎత్తున అక్రమ ఒప్పందాలు సాగుతున్నాయి.

### టూర్లు.. బర్త్‌డే వేడుకల ఖర్చులు!

గ్రామాల్లోని పేదలు అనారోగ్యం బారిన పడితే మొదట ఆశ్రయించేది స్థానిక ఆర్ఎంపీ, పీఎంపీలనే. దీన్ని ఆసరాగా చేసుకుని, సదరు క్లినిక్ నిర్వాహకులు రోగులను తమకు కమీషన్ ఇచ్చే ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇలా పంపినందుకు గాను చికిత్సకు అయ్యే మొత్తం బిల్లులో ఏకంగా 30 శాతం వరకు కమీషన్లు ఆర్ఎంపీల జేబుల్లోకి వెళ్తున్నట్లు సమాచారం.

కేవలం డబ్బు రూపంలోనే కాకుండా, ఎక్కువ సంఖ్యలో రోగులను రిఫర్ చేసే ఆర్ఎంపీలకు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు 'ప్రత్యేక టూర్లు' విహార యాత్రల ప్యాకేజీలను ఆఫర్ చేస్తున్నాయి. అంతేగాకుండా ఆర్ఎంపీలు, పీఎంపీల ఇళ్లల్లో జరిగే పుట్టినరోజులు, పెళ్లి రోజు వేడుకలు, గృహప్రవేశాలు, చివరికి వారి పిల్లల వివాహాల ఖర్చులను సైతం కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలే భరిస్తూ.. వారికి బంగారం, విలువైన కానుకలను అందిస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

### నిబంధనలు ఉల్లంఘించి


నిజానికి ఆర్ఎంపీ, పీఎంపీలు రోగులకు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాలి. అంతకుమించి ఎలాంటి ఇంజెక్షన్లు ఇవ్వడం కానీ, గ్లూకోజ్ బాటిళ్లు ఎక్కించడం కానీ చేయకూడదు. కానీ జిల్లాలోని పల్లెలు, పట్టణాల్లోని పలు కేంద్రాల్లో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన సాగుతోంది. యాంటీబయోటిక్ ఇంజెక్షన్లు ఇస్తూ, ఐవీ ఫ్లూయిడ్స్ పెడుతూ అడ్డగోలుగా డబ్బులు గుంజుతున్నారు. సరైన అవగాహన లేని వైద్యం కారణంగా గతంలో నందిపేట్, కామారెడ్డి, భీమ్‌గల్ ప్రాంతాల్లో గర్భిణులు, సాధారణ రోగులు ప్రాణాలు కోల్పోయిన ఉదంతాలు జిల్లాను ఉలిక్కిపడేలా చేశాయి.

### మా చేతుల్లో ఏం లేదు



ఆర్ఎంపీ, పీఎంపీలు రోగులకు కేవలం ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలి. ఇంజెక్షన్లు ఇవ్వడం, గ్లూకోజ్ పెట్టడం లాంటివి చట్టవిరుద్ధం. గతంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకున్నాం. అయితే ప్రస్తుతం మా చేతుల్లో ఎలాంటి ప్రత్యేక అధికారాలు లేకపోవడం వల్లే పూర్తిస్థాయిలో నిలువరించలేకపోతున్నాం.

**– రాజశ్రీ , డీఎంహెచ్‌వో**



## గుప్తనిధుల కోసం తవ్వకాల ఘటన.. కొనసాగుతున్న పోలీసుల విచారణ

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలో గుప్తనిధుల తవ్వకాలకు సంబంధించిన ఘటనలో పోలీసులు విచారణ ముమ్మరం చేసినట్లు సమాచారం. తవ్వకాల కోసం వచ్చిన వారు ఎవరు..? వారిని పురమాయించిన వారెవరనే విషయాలపై సమాచారం సేకరిస్తున్నారు. నగరంలోని 20వ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో శుక్రవారం రాత్రి ఓ మహిళ తన సొంత స్థలంలో రాత్రివేళ తవ్వకాలు చేస్తోందని స్థానికులు ఆరోపించారు. ఈ క్రమంలో మూడురోజులుగా రాత్రివేళల్లో జరుగుతున్న ఈ తతంగంపై శుక్రవారం రాత్రి సదరు మహిళను ప్రశ్నించారు. దీంతో ఆమె అక్కడి నుంచి వెళ్లిపోగా కూలీలు పరారయ్యారు. స్థానికులు నాల్గో టౌన్ పోలీసు లకు సమాచారం అందించగా స్పందించిన వారు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు.

## కలెక్టరేట్‌లో ఉత్సాహంగా 'మాక్ పార్లమెంట్'





**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ.. మహిళా వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన 'మాక్ పార్లమెంట్' ఉత్సాహంగా సాగింది. బాలికలు పార్లమెంట్‌లో లాగా ప్రజాప్రతినిధులు, ప్రతిపక్ష నాయకులుగా వ్యవహరించిన తీరుపై కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రసంశలు కురిపించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేయగా.. అదనపు డీసీపీ శుభం నగ్రాలే, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా ఆయా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బాలికలు స్పీకర్, డిప్యూటీ స్పీకర్, సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష సభ్యుల పాత్రలను పోషిస్తూ మాక్ పార్లమెంట్ నిర్వహించారు. మహిళా సాధికారత, బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఉపాధి అవకాశాలు, సమాజ అభివృద్ధి తదితర అంశాలపై ఎమ్మెల్యేలుగా వ్యవహరించిన బాలికలు ప్రశ్నించగా.. సంబంధిత శాఖల మంత్రుల పాత్రను పోషించిన బాలికలు సమాధానాలు చెప్పారు. దాదాపు రెండు గంటలకు పైగా మాక్ పార్లమెంట్ సెషన్ ఆద్యంతం ఆసక్తిగా కొనసాగింది. చట్ట సభలకు ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధుల పాత్రలో బాలికలు ఎంతో చక్కగా ఇమిడిపోయి రాణించడంపై కలెక్టర్ వారిని అభినందిస్తూ తన తరపున పలువురికి ప్రత్యేక బహుమతులు అందించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడం, సముచిత నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తూ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిణతిని ప్రదర్శిస్తూ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించుకోవాలని హితవు పలికారు.

## వడ్లు కొనకపోతే రైతులతో రాస్తారోకోలు చేస్తాం..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. , వెంటనే స్పందించకపోతే రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెద, కన్నారెడ్డి గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను శనివారం బీఆర్ఎస్ నాయకుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా కేంద్రాల్లో పేరుకుపోయిన వరి కుప్పలను, రైతుల ఇబ్బందులను బీఆర్ఎస్ బృందం స్వయంగా పరిశీలించింది. ఈ సందర్భంగా వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు కొనుగోలుకేంద్రాల్లోని వడ్లు తడిసి ముద్దయ్యాయని, కొన్నిచోట్ల మొలకలు వస్తున్నా ప్రభుత్వానికి చలనం లేకపోవడం దుర్మార్గమన్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం ఎలాంటి ఆంక్షలు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రెండు రోజుల్లో కల్లాల్లో ఉన్న వడ్లన్నింటినీ ప్రభుత్వం వెంటనే సేకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఇన్‌ఛార్జి జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జనార్దన్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ విజీ గౌడ్, జడ్పీ మాజీ ఛైర్మన్ దఫేదార్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## అన్నదాతకు తీరని కష్టాలు..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రైతులకు ధాన్యం విక్రయ కష్టాలు ఇప్పట్లో తీరేటట్టుగా లేవు. నెలలుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మగ్గిపోయిన వడ్లను ఎట్టకేలకు లారీలు ఎక్కించి రైస్‌మిల్లులకు తరలిస్తుంటే.. చాలా ప్రాంతాల్లో లారీలు బోల్తాపడి వడ్లు రోడ్ల పాలవుతున్నాయి. లింగంపేట్ మండలం జల్దిపల్లి గ్రామం నుంచి వడ్ల లోడుతో వెళ్తున్న లారీ శుక్రవారం రాత్రి నల్లమడుగు పెద్ద తండా వద్ద బోల్తాపడింది. లారీలో సుమారు 800 బస్తాల ధాన్యం ఉండగా, ప్రమాదం కారణంగా అన్ని బస్తాలు రోడ్డుపై చెల్లాచెదురయ్యాయి. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అక్కడికి చేరుకున్న రైతులు ఆరోపించారు. ప్రమాద సమయంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. వెంటనే స్పందించి వేరే లారీ ఏర్పాటు చేసి, ధాన్యం బస్తాలను రైస్ మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## గాంధీభవన్‌లో కాంగ్రెస్ వన్‌టువన్ సమీక్షలు

**అక్షరటుడే, కామారెడ్డి:** టీపీసీసీ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో శనివారం పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా వన్‌టువన్ సమావేశాలు జరిగాయి. సమావేశాలకు ఏఐసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడం, ప్రతి పార్లమెంట్ స్థానంలో సమన్వయం, ఎన్నికల సంసిద్ధతను సమీక్షించడమే ప్రధాన అజెండాగా సమావేశం జరిగిందని గడ్డం చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సర్ మ్యాపింగ్, బీఎల్ఏ 2 శిక్షణ, ఎస్ బీఎల్ఏ కమిటీల పురోగతి, బీఎల్ఏ జాబితాల తుది పరిశీలనపై చర్చ సాగిందని ఆయన వివరించారు.



## ప్రాణాలు కాపాడితే రూ.25 వేల నజరానా..: కలెక్టర్



**అక్షరటుడే, కామారెడ్డి:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని 'గోల్డెన్ అవర్'లో ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వారికి రూ.25 వేల నగదు బహుమతి అందజేస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రకటించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం రహదారి వీరుల పథకంపై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు స్పందించి బాధితులకు సాయం చేయాలని, ప్రతి ఒక్కరూ రహదారి వీరులుగా మారాలని పిలుపునిచ్చారు. పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు డిస్ట్రిక్ట్ అప్రిసియేషన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన ఎస్పీ, డీటీవో, డీఎంహెచ్‌వో సభ్యులుగా ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. రోడ్డుపై కొట్టుకుంటున్న ప్రాణాన్ని కాపాడితే ప్రభుత్వం ఇచ్చే రూ.25 వేలు కేవలం గుర్తింపు మాత్రమేనన్నారు. ఒక్క నిమిషం ఆలస్యం కూడా ప్రాణం తీస్తుందని, సకాలంలో స్పందించే వ్యక్తి చొరవ ఒక కుటుంబానికి దీపం అవుతుందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు ప్రజలు, అధికారులు కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. రహదారి వీరుల పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు పక్కన ఆక్రమణలే ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నాయని, వాటిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, డీటీవో శ్రీనివాస్, ఎన్‌హెచ్ఏఐ, అటవీ, ఆర్ అండ్‌బీ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వానలు పడితేనే..
# ‘ఖరీఫ్’కు నీళ్లు..



ఉత్తర తెలంగాణ జీవనాడి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరువైంది. ప్రస్తుతం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ లెవెల్‌కు కేవలం 11 టీఎంసీల దూరంలో ఉంది. నిజా మాబాద్ జిల్లాలో 45 డిగ్రీలకు పైగా ఎండలు ఉండడం.. ఎగువన బాబ్లీ నుంచి నీళ్లు రాకపోవడంతో ప్రాజెక్టు బోసిపోతోంది. దీంతో ఆయకట్టు రైతులు, తాగునీటిపై ఆధారపడ్డ లక్షలాది మంది ఆందోళన చెందుతున్నారు. ఎగువన మహారాష్ట్రలో కురిసే వర్షాలు, బాబ్లీ గేట్ల ఎత్తివేతపైనే అందరి ఆశలు ఉన్నాయి.

– అక్షరటుడే, ఆర్మూర్

■ డెడ్ స్టోరేజీకి 11 టీఎంసీల దూరంలో సాగరం.. ■ జూలై 1న బాబ్లీ గేట్లు ఎత్తివేత.. ■ అప్పటివరకు వర్షాలపైనే ఆధారం..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 80.5 టీఎంసీలు.. 1091 అడుగులుగా ఉంది. డెడ్ స్టోరేజీ 5.18 టీఎంసీలు. అయితే శనివారం నాటికి ప్రాజెక్టులో 16.405 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అంటే డెడ్ స్టోరేజీకి 11 టీఎంసీల దూరంలో ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1091 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1065.30 అడుగులకు పడిపోయింది. కాగా గతేడాది ఇదే సమయానికి 12.67 టీఎంసీలు,1,062 అడుగులుగా ఉంది. గత కొన్ని నెలలుగా ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది. మిషన్ భగీరథ, మున్సిపాలిటీల తాగునీటి అవసరాలు 410 క్యూసెక్కుల ఆవిరి రూపంలో రోజుకు 941 క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్ నుంచి ఖాళీ అవుతోంది. గతేడాదితో పోలిస్తే నాలుగు టీఎంసీల నీరు ప్రాజెక్టులో ప్రస్తుతం అధికంగా ఉంది.

### ఆశలన్నీ బాబ్లీపైనే..

గోదావరిపై మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు వివాదం అందరికీ తెలిసిందే. ఎస్సారెస్పీకి వచ్చే నీటిని బాబ్లీ అడ్డుకుంటుందని తెలంగాణ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారించిన సుప్రీంకోర్టు 2013లో కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రతియేటా జూలై 1 నుంచి అక్టోబర్ 28 వరకు, అంటే వర్షాకాలం 4 నెలల పాటు బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లను పూర్తిగా ఎత్తేసి ఉంచాలి. ఈ కాలంలో గోదావరి నదిలో వచ్చే వరద నీటిని యథాతథంగా దిగువకు వదిలేయాలి. మహారాష్ట్ర నీటిని నిల్వ చేసుకోకూడదు. గేట్ల ఎత్తివేతను పర్యవేక్షించడానికి కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల ఇంజినీర్లతో కమిటీని నియమించారు.

### ఈ ఏడాది పరిస్థితి ఎలా ఉందంటే..

గతేడాది జూలై - అక్టోబర్ మధ్య బాబ్లీ గేట్ల ద్వారా ఎస్సారెస్పీకి 32 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చింది. అయితే ఈసారి మహారాష్ట్రలోని నాందేడ్, పర్భణి జిల్లాల్లో ఇప్పటివరకు వర్షాలు ప్రారంభం కాలేదు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జూన్ రెండో వారం నుంచి రుతు పవనాలు చురుగ్గా మారితేనే వర్షాలు కురిసి ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో మొదలయ్యే అవకాశం ఉంది.

### ఆయకట్టు, తాగునీటిపై ప్రభావం..

ఎస్సారెస్పీ కింద నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లో 6 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం ఉన్న నీరు మిషన్ భగీరథ ద్వారా 15 లక్షల మందికి తాగునీరు అందించడానికే సరిపోతుంది. ఇన్‌ఫ్లో రాకపోతే ఖరీఫ్‌లో ఆయకట్టుకు నీరివ్వడం అసాధ్యం. బాబ్లీ గేట్లు తెరిచినా ఎగువన వర్షాలు పడకపోతే ప్రయోజనం ఉండదు. వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి గోదావరి నీటిని ఎస్సారెస్పీకి తరలించాలి. లేకపోతే సాగునీటికి ఇబ్బందులు తప్పవని ఎస్సారెస్పీ ఆయకట్టు రైతులు వాపోతున్నారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజ్‌కి 11 టీఎంసీల దూరంలో ఉందని ఈలోపు వర్షాలు వస్తాయని ప్రాజెక్టుకు ఎలాంటి ఇబ్బంది లేదని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కొత్త రవి తెలిపారు.

## కాకతీయ ద్వారా నీటిని విడుదల చేయాలి



కాకతీయ కాలువ పొడవున రైతులు పసుపు పంట సాగు చేయడానికి సిద్ధమవుతున్న దృష్ట్యా లీకేజీ నీటిని కాకతీయ కాలువ ద్వారా విడుదల చేయాలి. ప్రాజెక్టులో తగినంత నీటిమట్టం ఉన్నందున నీటిని విడుదల చేయాలి. – వేముల ప్రశాంత్ రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే



## క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉద్యోగావకాశాలు

**అక్షరటుడే, బాన్సువాడ:** క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉంటాయని జిల్లా యువజన, క్రీడా అధికారి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. పట్టణంలోని జయశంకర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ శిబిరాన్ని శనివారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా యువ క్రీడాకారులతో మాట్లాడిన ఆయన.. సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకుని.. తమ క్రీడా నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారికి విద్య, ఉద్యోగ రంగాల్లో 2 శాతం క్రీడా కోటా ద్వారా అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఇలాంటి శిక్షణ శిబిరాలు యువ క్రీడాకారుల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆరోగ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, ప్రతి విద్యార్థి కనీసం ఒక క్రీడలో పాల్గొనాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో వాలీబాల్ కోచ్ సురేందర్, క్రికెట్ కోచ్ నరేష్ పాల్గొన్నారు.

## పెంచిన పెట్రో ధరలను తగ్గించాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** పెంచిన పెట్రో ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆర్మూర్ కమిటీ డిమాండ్ చేసింది. ఆ పార్టీ ఆర్మూర్ సంయుక్త మండలాల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని కుమార్ నారాయణ భవన్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు బైక్‌లు, ఆటోలను తోసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవరం, నాయకులు ముత్తన్న మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12ఏళ్లనుంచి పేద ప్రజల మీద మధ్యతరగతి ప్రజల మీద పెట్రోల్, డీజీల్, గ్యాస్ నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కిషన్, గంగాధర్, గంగారం, శేఖర్, రమేష్, సాయిలు, పద్మ, లక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు లింబాద్రి , పోషన్న, నాగన్న , రవిగౌడ్ , యూసఫ్, గంగాధర్, నిఖిల్, రవి, రాజు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడికి సన్మానం



**భీమ్‌గల్, అక్షర టుడే:** కాంగ్రెస్ పార్టీ భీమ్ గల్ మండల నూతన అధ్యక్షుడిగా మల్లెల లక్ష్మణ్, టౌన్ అధ్యక్షుడిగా పర్స అనంతరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బాబాపూర్, చెంగల్, బడా భీమ్‌గల్ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో మండలంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులను నియమించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు సమీర్, దుమాల మమత రాజు, అరిగెల జనార్ధన్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ములుగురి గణేష్, నాయకులు చెప్పాల గణేష్ , రాగుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ కబడ్డీ రిఫరీ శ్రవణ్ యాదవ్‌కు ఘన సన్మానం

**అక్షరటుడే, ముప్కాల్:** భూపాలపల్లి జిల్లా జాతీయ కబడ్డీ క్రీడాకారుడు నేషనల్ రిఫరీగా వ్యవహరిస్తున్న శ్రవణ్ యాదవ్‌ను నిజామాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు శనివారం సన్మానించారు. ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఛైర్మన్ అంజయ్య, ప్రతినిధులు రాజ్‌కుమార్, మోతె గంగారెడ్డి, ముస్కు శ్రీనివాస్, కబడ్డీ కోచ్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళన పోస్టర్ ఆవిష్కరణ

**అక్షరటుడే, ముప్కాల్:** హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జూన్ 21న తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, దమ్మ ప్రచారక్ రాంజీ చార్వాక్, తెలంగాణ ఉద్యమ జేఏసీ నాయకులు సంజీవ్ థామస్, తెలంగాణ ఉద్యమ నాయకుడు సుధాకర్ పాల్గొన్నారు.



## బైక్‌పై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలి

**అక్షరటుడే, మెండోరా:** బైక్‌లపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై సుహాసిని సూచించారు. మెండోరా మండలం సోన్‌పేట్ గ్రామంలో ఉపాధి కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. అలాగే యువత మత్తు పదార్థాలు, గంజాయి వంటి వ్యసనాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట నర్సవ్వ మల్లేష్, కాంగ్రెస్ నాయకులు సోన్‌పేట్ నారాయణ, బండారి సాయన్న, ఫీల్డ్ అసిస్టెంట్ బాబు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## తెలంగాణ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ యునై టెడ్ పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీని శనివార ఎన్నుకున్నారు. నగరంలోని జేసీపీ చర్చ్‌లో జిల్లాలోని అన్ని నియోజకవర్గ అధ్యక్షులు, కార్యదర్శులు, ఉపాధ్యక్షుల సమక్షంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా రెవ పిట్ల సామ్యూల్, అర్బన్ ఛైర్మన్‌గా రెవ జోసెఫ్, కార్యదర్శిగా సీహెచ్ జాన్ బన్యన్, కోశాధికారులుగా అబ్రహం, కరుణాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ డానియల్, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా ప్రదీప్, డేవిడ్ రాజ్, సంయుక్త కార్యదర్శులుగా రవి ఆనంద్ ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా ఎలీషా, సువార్త రాజ్ , ఇసాక్, ఆమోస్, ప్రసాద్, విన్సెంట్ , తిమోతీ రాజ్ , జానా రమేష్, హనోక్, ఆనంద్ పాల్, మాణిక్యాల శ్రీనివాస్, అనంత్ రావు, సుధీర్, చీఫ్ అడ్వైజర్లుగా రెవ వి జెకర్యా ఆనంద్, బిషప్ జాన్సన్, రెవ బి జోసెఫ్, రెవ అబ్రహం, రెవ సీహెచ్ జోసెఫ్ ఎన్నుకున్నారు.

## లక్ష్మాపూర్‌లో శివాలయం ప్రథమ వార్షికోత్సవం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** లక్ష్మాపూర్ శివాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం పుణ్యవచనం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజుల సాయిలు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రియుడి ఇంటి ఎదుట యువతి ఆందోళన..

**పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని ఆరోపణ..**

**అక్షరటుడే, బోధన్:** పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి యువకుడు మోసం చేశాడని ఓ యువతి ఆరోపించింది. ఈ మేరకు బాధితురాలు ఎడపల్లి మండలం దుబ్బ తండాలో యువకుడి ఇంటి ఎదుట శనివారం ధర్నాకు దిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి మండలం దుబ్బతండాకు చెందిన యువకుడు అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పాడు. ఈ క్రమంలో ఆ యువతి గర్భవతి కాగా.. పెళ్లి చేసుకోవాలని కోరగా తిరస్కరిస్తూ వచ్చాడు. దీంతో విసుగు చెందిన సదరు యువతి శనివారం దుబ్బ తండాలోని యువకుడి ఇంటి ఎదుట ధర్నాకు దిగింది. బాధితురాలి కుటుంబ సభ్యులు సైతం ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. సదరు యువకుడిపై పోలీసు కేసు నమోదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని తమకు న్యాయం చేయాలని వారు కోరారు.





## ఎల్లారెడ్డిలో అమ్మకు అక్షరమాల ఉల్లాస్ కార్యక్రమం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా.. మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో ‘అమ్మకు అక్షరమాల ఉల్లాస్’ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పట్టణంలోని 11వ వార్డులో నిర్వహించిన కార్యక్రమానికి కౌన్సిలర్ లక్ష్మీ శివరాములు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల అక్షరాస్యతతోనే కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె అన్నారు. ప్రతి మహిళ చదువుపై ఆసక్తి చూపి అక్షరాస్యత పెంపొందించుకోవాలని సూచించారు. మహిళలు విద్యావంతులైతే కుటుంబ ఆర్థిక పరిస్థితితో పాటు పిల్లల భవిష్యత్తు కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ప్రభుత్వం మహిళల సాధికారత కోసం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి మహిళ స్వయం సమృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు అక్షరాస్యత ప్రాముఖ్యత, విద్య వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, మెప్మా ఆర్పీలు, స్థానిక మహిళలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## వారంరోజులుగా నీటి కష్టాలు..
# అల్లాడుతున్న ప్రజలు



**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని హన్మాజిపేట్ గ్రామ ప్రజలు తీవ్రమైన మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని 3వ వార్డులో గత వారం రోజులుగా రెండు బోరు మోటార్లు పనిచేయకపోవడంతో స్థానికులకు తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఎండల తీవ్రత పెరిగిన ఈ సమయంలో నీటి కొరత మరింత తీవ్రరూపం దాల్చింది. ప్రతిరోజూ ఉదయం నుంచి మహిళలు, వృద్ధులు నీటి కోసం బిందెలతో గ్రామమంతా తిరుగుతున్న పరిస్థితి నెలకొంది.

### ఆటోలు.. బైక్‌లపై..

కొందరు దూర ప్రాంతాల నుంచి ఆటోలు, బైక్‌లపై నీటిని తెప్పించుకుంటుండగా, మరికొందరు ప్రైవేట్ బోర్లపై ఆధారపడుతున్నారు. స్థానికులు పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు మోటార్ల మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇక గ్రామంలో మిషన్ భగీరథ నల్లాల ద్వారా కూడా సక్రమంగా నీటి సరఫరా జరగడం లేదని చెబుతున్నారు. నల్లాల్లో నీరు రాకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరు మోటార్లు మరమ్మతు చేసి మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా పునరుద్ధరించాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నారు.